మి నీ క థ

# చెప్పడానికే నీతి

మ ల్లి క్

రెండో నెంబరు బస్సు దుమ్మురేపుకుంటూ వచ్చి ఆగింది. అది రేపినదుమ్ము బస్సును దాటి మేఘంలా వెళ్లిపోయింది. బస్సుస్టాపులో పావుగంటనుండి ఎదురుచూస్తున్న జనం బస్సు మీదకు విరుచుకుపడ్డారు. వెంగళ్రావు భార్యామణి చింతామణితో బస్సెక్కాడు. ఎక్కడైనా కూర్చోడానికి సీటు దొరుకుతుందేమోనని చుట్టూ కలయజూశాడు.. ఎక్కడా సీటులేదు. నిలుచోకతప్పదు. కానీ లేడీస్‌సీటు ఒకటి ఖాళీగా ఉంది. అందులో చింతామణి కూర్చోవచ్చుగానీ అందులో ఎవరో ఒకతను కూర్చుని ఉన్నాడు.

"చూశారా....ఆడవాళ్లసీట్లో ఎలాకూర్చున్నాడో? నన్ను చూసికూడా లేవట్లేదు....మీరైనా చెప్పండీ" చింతామణి వెంగళ్రావు డొక్కలో పొడిచింది.

"ఉండవే అడుగుతాను" డొక్క తడుముకున్నాడు వెంగళ్రావు.

బస్సుకదిలింది. అతను కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు.

"ఏయ్ మిస్టర్...." వెంగళ్రావు పిలిచాడు.

అతను చూడలేదు. వినపడలేదో లేక వినబడీ వినబడనట్లు నాటకమో!!....

"ఏమండీ మిమ్మల్నే...." ఈసారి కాస్త గట్టిగా పిలిచాడు. అయినా లాభంలేకపోయింది.

"మిస్టర్....మిమ్మల్నే" ఈసారి అతని బుజంతట్టి పిలిచాడు.

తలపైకెత్తి ఏమిటన్నట్లు చూశాడతను.

"ఇది ఆడవాళ్ల సీటు!...." అన్నాడు వెంగళ్రావు.

"ఆడవాళ్ల సీటని ఎక్కడా రాసిలేదే?" అన్నాడతను నిర్లక్షంగా.

"రాసి ఉండక్కర్లేదు. బస్సులో మొదటి మూడు సీట్లూ ఆడవాళ్లకోసం కేటాయించబడినవని అందరికీ తెలుసు...."

"నాకు తెలీదు" అన్నాడతను విసురుగా.

"ఇప్పుడు నేను చెప్తున్నానుగా?" వెంగళ్రావు అంతకంటే విసురుగా అన్నాడు.

"మీరు చెప్పినంత మాత్రాన నేను వినాలని లేదుగా?"

బస్సులో వాళ్లందరి తలలూ అప్పటికే వీళ్లవైపు తిరిగాయి.

"అది లేడీస్‌సీట్ నాయనా....లేచి ఆవిడకు సీటివ్వు" ఎవరో ముసలాయన అన్నాడు.

"నేనెందుకు లేవాలి.... నేను ఈ బస్సు స్టార్టింగు పాయింటునుండీ కూర్చుని వస్తున్నాను. ఇప్పుడిప్పుడే బస్సు ఎక్కి సీటురెడీగా ఉండాలంటే ఎలా?...."

"మేము బస్సు ఇప్పుడే ఎక్కి ఉండవచ్చు కాని బస్సుస్టాపులో గంటనుండి బస్సుకోసం నిలబడి ఉన్నాము" వెంగళ్రావు కోపంగా అన్నాడు.

"అయితే అందుకు నేనేం చెయ్యను.... బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచమని వెళ్లి డిపో మేనేజరుకి చెప్పుకోండి. నేనుకూడా ఒకగంట బస్సుకోసం ఎదురుచూసే ఎక్కాను. అయినా నా పక్కన సీటుందిగా. మీ ఇద్దరిలో ఎవరు కూర్చున్నా నాకు అభ్యంతరంలేదు," అదే నిర్లక్ష్యంతో సమాధానం చెప్పాడతను.







వెంగళ్రావుకి కోపం నసాళానికి అంటింది.

"ఏమిట్రా కూస్తున్నావ్?.... నా భార్య నీ పక్కన కూర్చోవాలా?.... పళ్లురాలగొడతా ఏమనుకున్నావో" గట్టిగా అరుస్తూ అన్నాడు.

"రా....గీ....అంటూ పేల్తున్నావేమిటి? మర్యాద ఇచ్చి మాట్లాడు. నేనూ పళ్లురాలగొట్టగలను" అంతకంటే గట్టిగా అరుస్తూ అన్నాడు అతను.

"నీకు మర్యాద ఏమిట్రా....నిన్నూ...."

ఇద్దరికీ మధ్య వాగ్యుద్ధం ఒక పదినిమిషాలపాటు సాగింది. బస్సులోని అందరూ వెంగళ్రావు తరఫునే మాట్లాడేరు.

"ఈ కుర్రకారుకంటె మన ముసలాళ్లమేనయం....వీళ్లు ఒక అయిదు నిమిషాలుకూడా నిలబడలేరు."

"అయినా ఆడవాళ్ల సీట్లో కూర్చుని కూడా ఎలా దబాయిస్తున్నాడో చూడండి...."

"పొగరండీ బాబూ...."

"అతనైతే ఊరికే అనవసరంగా వాగుతున్నాడుగానీ నేనైతే రెండందుకునే వాడిని"

"ఆ ముఖం చూడండి .... రౌడీముఖం వాడూను"

ఇలాసాగాయి బస్సులోవారి కామెంట్లు. అందరూ అతన్ని లేచి చింతామణికి సీటివ్వమని గోలచేశారు. చివరికి అతనికి లేవకతప్పలేదు. చింతామణి ఒకసారిమూలిగి రుసరుసలాడుతూ కూర్చుంది. వెంగళ్రావు నిలబడే ఉన్నాడు.

"ఆమె పక్కసీటు ఖాళీగానే ఉందిగా.... మీరూ కూర్చోండి...." ఎవరో వెంగళ్రావుతో అన్నారు.

"అబ్బే....అది లేడీస్‌సీటుగా...." వెంగళ్రావు మొగమాట పడ్డాడు.

"అయితే ఏం?.... ఇప్పుడెవరూ లేరుగా.... ఎవరైనా ఆడవాళ్లు వచ్చినప్పుడు లేచి సీటివ్వచ్చు"

వెంగళ్రావు తెగ మొగమాట పడిపోతూ చింతామణి పక్కన కూర్చుంటూ తమవెనక సీటువైపుచూశాడు. వెంగళ్రావు మనసు చివుక్కుమంది. వెనక సీట్లోని ఆమె వంకరగా నవ్వుతూ వెంగళ్రావు కళ్లలోకి చూసింది సూటిగా. ఆమె కళ్లలో ఛీత్కారం.

అవును ఆమే!!....

రెండురోజులక్రితం లేడీస్‌సీటు విషయమై వెంగళ్రావుకూ ఆమెకూ గొడవజరిగింది.

"పురుషులతో సమానమైన హక్కులు అంటారు. మరి ఈ రిజర్వేషన్లేమిటి....నేను ఈ సీట్లోంచి లేవనుగాక లేవను" అని అన్న వెంగళ్రావుమాటలు ఆమె చెవుల్లో ఇంకా గింగురు మంటున్నాయి. □